

# దేవుడు ఒకడే!

ఒకసారి బాబావద్ద హోరాహోరీగా భజన జరుగుతోంది. అక్కడికని ఓ ఇద్దరు భక్తులు బయలుదేరి వస్తున్నారు. దారి మధ్యలో మరో స్నేహితుడు వారికి కనిపించగా, ''ఒరేయ్ వెంకడూ నీవూ మాతో వస్తావా బాబా భజనకి. షిరిడీలో చాలా బాగా జరుగుతోంది. ఈ రోజు బాబాకి ఎంతో ప్రియమైన రోజు. అందుకని రోజంతా భజన ఆగకుండా జరుపుతారు. నీవూ రాకూడదూ?'' అని అడిగారు.

దానికి వెంకడు, ''నాకు బాబా అంటే నచ్చదు, గిట్టదు. అసలు ఆయన దేవుడూ కాదు! దేవుడి అవతారమూ కాదు. అంతా మీ పిచ్చి అంతే'' అన్నాడు వ్యగ్యంగా.

''అలా అనకూడదురా. ఆయనా దేవుడి అవతారమే తెలుసా!'' అని హెచ్చరించాడు.

''అయినా సరే, నేను ఆంజనేయస్వామి భక్తుడ్ని. యిప్పుడు ఆంజనేయస్వామి గుడికే వెళ్తున్నాను. అనవసరంగా నన్ను దారి మరల్చకండి'' అంటూ నసుగుతూ మరో దారిన వెళ్ళాడు. ''హు.. ఎవరి పిచ్చి వారికానందం'' అనుకున్నారు మనసులో వేళాకోళంగా.

ఆ తర్వాత వీరు బాబా భజనకి, అతను ఆంజనేయస్వామి గుడికి చేరతారు. ఆ రోజు మంగళవారం కావటం మూలంగా అక్కడక్కడా ఆంజనేయస్వామి భక్తులంతా చేరి భజన చేస్తూంటారు. చోటులేక వెంకడు దూరంగా కూర్చున్నాడు. తనూ పాటలు పాడుతూ, భజనలో పాల్గొని తాళం వేస్తున్నాడు తన్మయత్వంతో. కానీ, విచిత్రం ఏమిటంటే ఆంజనేయస్వామికి బదులు అతనికి ఆ చోటులో బాబా కనిపించసాగారు. అతను నిర్ఘాంతపోయి కళ్ళు తుడుచుకుని మళ్ళీ మళ్ళీ చూడగా, బాబానే నవ్వుతూ దీవిస్తూ కనిపించసాగారు. అనుమానం వచ్చి పక్కవారితో ''ఆ విగ్రహం ఎవరిది?'' అని అడగగా ఒకరు ''బాబాందని'', మరో యిద్దరు ''ఆంజనేయస్వామి గుడికి వచ్చి,

జి. రామలక్ష్మి, హైద్రాబాదు

ఆంజనేయ స్వామి భజనలో కూర్చుని, ఆ విగ్రహం ఎవరిదని అడుగుతావేం? నీవేమయినా పిచ్చి వాడివా? కళ్ళు బైర్లు కమ్ముతున్నాయా?'' అన్నారు కోపంగా. మరొకతను మాత్రం 'అది బాబా విగ్రహం' అన్నాడు.

కానీ వెంకడికి కనిపించేది స్పష్టంగా బాబా విగ్రహవే. అందువలన అతడు తన అను మానం తీర్చుకోవటం కోసం అందరినీ దాటు కుంటూ ఆ విగ్రహం దగ్గరకు వెళ్లి చూడగా అది ఆంజనేయస్వామిదే.

''అంతా నా భ్రమన్నమాట బాబాదనుకోటం!'' అని అనుకుని, మళ్ళీ దూరంగా వచ్చి చూడగా బాబా చిరునవ్వులు చిందిస్తూ ఆశీర్వదిస్తూ కనిపించసాగారు. అప్పటికి అతనికి జ్ఞానోదయం అయింది. అంతేకాకుండా అదే ఆవరణలో వున్న వినాయకుడి గుడికి, శివుడి గుడికి, సుబ్రహ్మణ్యస్వామి గుడికి కూడా వెళ్ళాడు. అక్కడా అతనికి బాబానే అగుపించారు. ఈ విధంగా సర్వ దేవుళ్ళ విగ్రహాల నుంచి బాబానే కనిపించగా, అతనిలో పూర్తిగా మార్పు కలిగి, ''బాబా నన్ను క్షమించు తండ్రీ. నీవు ఒక మామూలు మనిషివనుకున్నానేకానీ, సకల దైవ స్వరూపుడవని, సాక్షాత్తూ భగవత్ స్వరూపుడవని గ్రహించుకోలేక దుర్భాషలాడాను. నన్ను క్షమించు తండ్రీ. దేవుడు ఒక్కడే అని నిరూపించడం కోసం అన్ని రూపాలలోను నీవే అగుపించావా తండ్రీ!'' అంటూ లెంపలేసుకుని, కళ్ళనీళ్ళు కారుస్తూ 'బాబా... బాబా' అంటూ పరుగున వచ్చి బాబా పాదాలపై వాలి క్షమార్పణ కోరుకుని భజనలో కూర్చున్నాడు.

సంగతి తెలుసుకున్న అక్కడి భక్తులందరూ ఆశ్చర్యానందాలతో, ''సర్వశక్తి స్వరూపుడు, సర్వాంతర్యామి, ఓ సాయినాథా.. పాహిమాం, రక్షమాం, కరుణాసింధో'' అంటూ భక్తితో ప్రార్థించారు.

బాబా చిరునవ్వుతో అందరినీ ఆశీర్వదించారు. 'అల్లామాలిక్, హే రామ్, ఓం నమ శ్శివాయ' అంటూ పలికి అక్కడినుంచి కదిలారు లోపలికి. బాబా సర్వశక్తి, సకల దేవతా స్వరూపుడు అనడానికి అదే నిదర్శనం.

